ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023 5 అనంతపురం

ప్రతినిధుల సభలో ప్రసంగిస్తున్న ప్రసన్నకుమార్

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం

◆ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్
◆ ముగిసిన జిల్లా మహాసభలు ◆ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విద్యార్థులకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని ప్రతి ఒక్కరూ తిరస్కరిద్దామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ 31వ జిల్లా మహాసభలు గురువారం ముగిశాయి. రెండవరోజు ప్రతినిధుల సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ప్రభుత్వ విద్య రోజురోజుకు నీర్వీర్యం అవుతోందన్నారు. సంక్షేమ హాస్టళ్ల అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్య సంక్షోభంలో కూరుకుపోతున్నా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండం సిగ్గుచేటన్నారు. దేశవ్యాప్తంగా నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో వాటికి అనుగుణంగా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో హాస్టళ్లలో ఉండే పేద, మధ్య తరగతి విద్యార్థులు అర్ధాంతరంగా చదువును మధ్యలో ఆపేయాల్సిన దుర్భర స్థితిలో దాపురించాయన్నారు. ఇక ఉన్నత విద్యను నాశనం చేయడానికి కూడా కేంద్ర,రాష్ట్ర కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేజర్, మైనర్ సబ్జెక్టులను తీసుకొచ్చి డిగ్రీ విద్యార్థులు హాజరు శాతం తగ్గిపోయేలా చేశాయన్నారు. విభజన చట్టంలో ప్రధానమైన అనంతపురం సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు చేయకపోవడం చూస్తుంటే ప్రభుత్వాలకు ప్రభుత్వ విద్యపై ఎలాంటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిత్యపోరాటాలు చేస్తోందని, ఇందులో విద్యార్థులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు శివ, సిద్దు, నాయకులు వంశీ, రమేష్, వెంకటేష్, సూర్యప్రకాష్, శివ, భీమేష్, చందు, అశోక్, రజిత, మారుతి, హరిణ్య , అరవింద్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివ, ఓతూరు పరమేష్

ఓతూరు పరమేష్

శివ

భారత విద్యార్థి ఫెడరేష్ (ఎస్‌ఎఫ్‌ఐ) అనంతపురం జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తెలిపారు. రెండు రోజుల పాటు కళ్యాణదర్గం పట్టణంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ 31 జిల్లా మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివ, ఓతూరు పరమేష్‌లు రెండవసారి ఎన్నిక అయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడుగా వైటిసి.రమేష్, సిద్ధూ, గిరి, జిల్లా సహాయ కార్యదర్శులుగా సూర్యప్రకాష్, వెంకటేష్, రజిత, శివ, అశోక్, చందు, జిల్లా కమిటీ సభ్యులుగా అరవింద్, మారుతి, పవన్‌గౌడ్, హిరణ్య కలిసి 21 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

మిచౌంగ్ తుఫాను రాష్ట్రం మొత్తాన్ని వణికించింది. తుఫాన్ దెబ్బకు గత మూడు రోజులుగా అంతటా అపారమైన నష్టం సంభవించింది. కాని ఉమ్మడి అనంతపురం జిల్లాపై మాత్రం దీని ప్రభావం లేదు. మేఘాలు కమ్ముకుని రావడం అంతలోనే గాలి వేగానికి కొట్టుకుపోవడం కనిపించింది. అప్పుడప్పుడు, అక్కడక్కడ కొద్దిపాటి చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. తుఫాన్‌లో సైతం వర్షం కరువు అవడంపై రైతులు తీవ్ర నిర్వేదాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెద్దవడుగూరు ప్రాంతంలో వర్షం లేక మిరప మొక్కలకు డబ్బాలతో నీరు పోస్తున్న రైతులు (ఫైల్ ఫోటో)

తుఫాన్‌లోనూ వర్షం కరువే..!

ఇలాంటి వర్షం జాడ అనంతపురంలో లేనేలేదు..!

◆ అనంతను తాకని మిచౌంగ్ తుఫాన్
◆ రాష్ట్రమంతటా వర్షాలు
◆ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పడని వాన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

డిసెంబర్ 1వ తేదీ నుంచి తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రం అంతటా వర్షాలు అన్ని చోట్ల వర్షాలు పడుతున్నాయి. వానల ఉధృతికి పలు నగరాలు జలమయం అయ్యాయి. పంటలు చాలా వరకు నష్టం వాటిల్లాయి. మూడు రోజుల పాటు వర్షం జనజీవనాన్ని స్తంభింపజేసింది. అక్కడ పరిస్థితి అలా ఉంటే అనంతపురం, సత్యసాయి జిల్లాలో చినుకు జాడలేదు. ఒక్క ఎన్‌పికుంట మండలంలో మాత్రమే ఒక మోస్తరు వర్షపాతం తుఫాను ప్రభావం కారణంగా పడిందని చెప్పవచ్చు.

పడని వాన

ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచే వర్షాభావం జిల్లాలో నెలకొంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షాభావం వెంటాడుతుండటంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో మిచౌంగ్ తుఫాను ప్రభావంతోనైనా వర్షాలొస్తాయని రైతులు భావించారు. రాష్ట్రమంతటా వర్షం పడినప్పటికీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాన పడలేదు. డిసెంబరు ఒకటి నుంచి ఇప్పటి వరకు చూస్తే అనంతపురం జిల్లాలో సగటున 1.1 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. అది కూడా ఆత్మకూరు మండలం పరిధిలో 8.6 మిల్లీమీటర్లు, తాడిపత్రి పరిధిలో 6.5 మిల్లీమీటర్లు, పెద్దపప్పూరు మండలంలో 6.5 మిల్లీమీటర్లు, యల్లనూరు మండలంలో 4.9 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. తక్కిన చోట్ల చినుకుజాడలేదు. సత్యసాయి జిల్లాలో సగటున 4.7 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. అందులో గరిష్టంగా నంబులపూలకుంట మండలంలోనే వర్షపాతం నమోదయింది. 5వ తేదీన 47.8 మిల్లీమీటర్లు నమోదవగా 6వ తేదీన 0.5 మిల్లీమీటర్లు నమోదయింది. మొత్తంగా ఈ మండలం పరిధిలోనే ఈ ఐదు రోజుల్లో పడిన వర్షపాతం 51.5 మిల్లీమీటర్లు. ఆ తరువాత తలుపులలో 18.7 మిల్లీమీటర్లు, గాండ్లపెంటలో 18.1 మిల్లీమీటర్లు పడింది. ఈ మూడు మండలాల్లోనే తుఫాను ప్రభావం కొంత కనిపించింది. తక్కిన మండలాలు వర్షపాతం నమోదవలేదు.

ఏడాది మొత్తంగా 30 శాతానికిపైగా లోటు

అనంతపురం జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 453 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 288.7 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. సాధారణం కంటే 36.2 శాతం ఈ ఏడాది వర్షపాతం లోటుంది. 31 మండలాలు అనంతపురం జిల్లా పరిధిలో ఉంటే 24 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 521.5 మిల్లీమీటర్లు అయితే ఇప్పటి వరకు నమోదయిన వర్షపాతం 360.7 మిల్లీమీటర్లు. అంటే సాధారణం కంటే 30 శాతం వర్షపాతం లోటుంది. 32 మండలాలకుగానూ 25 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రెండు ప్రాంతాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రభుత్వం ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించింది. రబీలోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితులే నెలకొన్నాయి. ప్రభుత్వం కరువు మండలాలను అయితే ప్రకటించిది గానీ ఇంత వరకు ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టలేదు. దీనిపై రైతుల నుంచి తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం అవుతోంది. కరువు మండలాల ప్రకటనతో ప్రభుత్వం మిన్నకుండిపోకుండా సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని సిపిఎం, రైతుసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు దుర్మార్గం

అధికారుల చర్యలను అడ్డుకుంటాం
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ చట్టంలో భాగంగా వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన తీవ్రంగా ప్రయత్నించడం దుర్మార్గంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడంపై రైతుల్లో వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా వెనక్కు తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన వాటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లాలో మారుమూల మండలాలైన మడకశిర, అగళి ప్రాంతాల్లో రైతులకు మాయమాటలు చెబుతూ మోటర్లకు మీటర్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. అనంతపురం జిల్లాలోని కణేకల్లు, గార్లదిన్నె మండలాల్లో విద్యుత్ సబ్సిడీ గురించి ఏఇలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయానికి వాడుతున్న ప్రతి హెచ్‌పి (హార్స్‌పవర్)కి రూ.1600 రైతు ఖాతాలకు జమచేస్తామని, ఈ డబ్బు రైతుల నుంచి విద్యుత్ సంస్థలకు జమ అవుతుందని అధికారులు చెప్పడం రైతులను దగా చేయడమే అన్నారు. సబ్సిడీ మొత్తాన్ని చెబుతూ రైతుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్లు జిల్లా విద్యుత్ అధికారులు సేకరిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టేందుకు దొడ్డిదారిన ప్రయత్నించడం రైతులను మోసం చేయడమే అవుతుందన్నారు. ఒక రైతుకు ఎన్ని బోర్లు ఉన్నా, ఎన్ని హెచ్‌పిల కరెంటు వాడుతున్నా అన్నింటికీ సబ్సిడీ ఇస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి ఖర్చు అవుతున్న విద్యుత్‌కు ప్రభుత్వం ఆయా సంస్థలకు బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఈ పద్ధతిని మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. రైతులపై అదనపు భారం పడదని అధికారులు చెప్పడం మోసపూరితంగా ఉందన్నారు. అదే నిజమైతే రైతు ఖాతాలకు సబ్సిడీ ఎందుకు వేస్తున్నారని, ఏ కారణంతోనైనా సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు జమ చేయకపోతే విద్యుత్‌కు అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని విద్యుత్ సంస్థలు హామీ ఇవ్వడంలేదన్నారు. విద్యుత్ సబ్సిడీ విధానాన్ని హడావుడిగా అమలు చేయడం వెనుక తక్షణం రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి, రానున్న కాలంలో మోటర్లకు మీటర్లు పెట్టడానికి ప్రభుత్వం వేసిన ఎత్తుగడ అన్నారు. సబ్సిడీ ఆశ చూపి రైతుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ సేకరించడాన్ని తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దొడ్డిదారిన మీటర్లు పెట్టే విధానాన్ని రైతులు వ్యతిరేకించాలని రాంభూపాల్ పిలుపునిచ్చారు.

పంట నష్టం అంచనాల్లో రైతులకు ద్రోహం

రైతుల పక్షాన టిడిపి ఆందోళలు
పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటలు నష్టపోతే ప్రభుత్వం కాకిలెక్కలు చూపుతూ తీవ్ర ద్రోహం చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలన్నీ పూర్తి దెబ్బతిన్నాయన్నారు. అయితే తక్కువ విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని అంచనాలు తయారు చేయడం బాధాకరమన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులకు రైతుల సమస్యలు పట్టించుకునే తీరిక లేకుండా పోయిందన్నారు. గతేడాది రూ.1500 కోట్లు పెట్టుబడి నష్టపోతే కేవలం రూ. 211 కోట్లు పంట నష్టపరిహారం అందించారన్నారు. ఈసారి దాదాపు రూ.1300 కోట్లు పెట్టుబడిని రైతులు నష్టపోగా పంట నష్టం అంచనాల్లో మాత్రం రూ.251.20 కోట్లు మాత్రమే జరిగిందని ప్రతిపాదనలు పంపడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రైతుల పంట నష్టం అంచనాలు ఖచ్చితంగా సర్వే చేయించి ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో టిడిపి ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. టిడిపి అధికారంలోకి రాగానే రైతులను ఆదుకుంటామన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తీవ్రమైన కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలో తాడిపత్రి డిప్యూటీ తహశీల్దార్ రాజారామ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా వర్షాలు రాకపోవడంతో వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 31 మండలాలకు ఉండగా 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. దీనికితోడు పంట నష్టపరిహారం అంచనాల కోసం ఈనెల 14న జీవో నెం.5ను విడుదల చేసిందన్నారు. ఈ జీవో నిబంధనలు రైతులకు ఉపశమనం కలిగించే విధంగా లేకపోగా తీవ్రనష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన సమయంలో 33 శాతంపైగా పంట నష్టం జరిగి ఉండాలని గరిష్టంగా రెండు హెక్టార్లకు మాత్రమే పరిహారం ఇవ్వాలని వేరుశనగ, పత్తి పంటల పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ.45వేలు అవుతుండగా ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం ఎకరాకు కేవలం రూ.6,800 మాత్రమే అందుతుందన్నారు. అదేవిధంగా ఇతర పంటల పరిహారం ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అదేవిధంగా వలసలను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని దినాలను రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, పంటలు సాగు చేసిన కౌలురైతులకే నష్టపరిహారం అందివ్వాలని రైతుల బ్యాంకు అప్పులు మాఫీ చేసి నష్టపోయిన ప్రతి పంటకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంటల నష్టపరిహారం ఇచ్చేలా చూడాలని, సాగు చేసి నష్టపోయిన రైతుకు ఎకరాకు గరిష్టంగా రూ.50 వేల చొప్పున పదెకరాలకు ఇవ్వాలని, వర్షాభావం వల్ల విత్తనం వేయలేని రైతులకు ఎకరాకు రూ 30 వేలు పరిహారం ఇవ్వాలని, వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలని, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక కుటుంబాల విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలని, రెవెన్యూ గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కౌలు రైతులకు రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపిరైతుసంఘం నాయకులు

ఉపాధ్యాయులకు బకాయి వేతనాలు చెల్లించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని డిఇఒ కార్యాలయంలో డిఇఒ నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలకు రావాల్సిన నిధులు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసేది లేక చాలామంది ప్రధానోపాధ్యాయులు సొంత నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారన్నారు. అలాగే గుంతకల్లు మున్సిపాలిటీలో ఉన్న వివిధ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. అధికారులకు చాలాసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. వీరితోపాటు పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఆర్ట్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు, ఎంఇఓ కార్యాలయాల్లో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్పీలకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. వారికి వస్తున్న అరకొర జీతాలు చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాఘవేంద్ర, గౌరవాధ్యక్షులు రమణయ్య, ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, వివిధ మండలాల నాయకులు వీరేశ్వరాచారి, శేషప్ప, గంగాధర్, గుంతకల్లు మున్సిపాలిటీ నాయకులు తిమ్మారెడ్డి డిఎల్ జ్యోతి నిర్మల, జి.తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సింగేపల్లి పాఠశాలలో అన్నీ అరకొరే

ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని సింగేపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 200 మంది విద్యార్థులు విద్యాభ్యా సం సాగిస్తున్నారు. అయితే ప్రతి రోజూ 50మంది వరకూ విద్యార్థులు గైర్హాజరవుతున్నా ఉపాధ్యా యులు కానీ విద్యాశాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉపాధ్యాయు లు ఏడుగురు ఉండగా ఫేస్ హాజరు, అటెండెన్స్ హాజరు వేసిన తర్వాత ఇద్దరు మాత్రమే పాఠశాలలో ఉంటారని, మిగిలిన వారు అందుబాటులో ఉండడంలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇక మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట ఏజెన్సీ సిబ్బంది నలుగురు ఉండగా ఇద్దరు ఒక రోజు మరో ఇద్దరు ఒక రోజు విడతల వారీగా పని పంచుకున్నట్లు సమాచారం. దీంతో పిల్లలకు భోజనం వడ్డించడం, కోడిగుడ్లు పంచడం, పాఠశాల శుభ్రం చేయడం, తదితర పనులన్నీ విద్యార్థులే చేయాల్సి వస్తోంది. నాడు-నేడు నిధులన్నీ ఖర్చు చేసినా విద్యార్థులకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు లేక ఆరుబయటకు వెళ్తుండగా, తాగునీటి కోసం పబ్లిక్ కుళాయిని ఆశ్రయిస్తున్నారు. మెనూ సైతం సక్రమంగా అమలు చేయకుండా విద్యార్థులకు అరకొరగానే భోజనం అందిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాల మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున మండల విద్యాధికారుల పర్యవేక్షణ కరువైందని స్థానికులు మండిపడుతున్నారు. ఆయా విషయాలపై ఎంఇఒ మల్లికార్జునను వివరణ కోరగా అలాంటిది ఏమీ లేదు. తాగునీటి కొళాయిలు వేయిస్తాం, మరమ్మతులు చేయిస్తాం, ఉపాధ్యాయులు అందరూ హాజరవుతున్నారంటూ దాటవేశారు.

కింద కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) కోడిగుడ్లను తీసుకెళ్తున్న విద్యార్థి

‘ఉన్నతి-మహిళా శక్తి’తో జీవనోపాధుల కల్పన

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళలకు శక్తివంతమైన జీవనోపాధులు కల్పించేందుకు ‘ఉన్నతి-మహిళా శక్తి’ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ ఆవరణలో ఉన్నతి - మహిళాశక్తి పథకాన్ని జాయింట్ కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా లబ్ధిదారులకు ఆటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతి - మహిళాశక్తి పథకం కింద ఎస్సీ, ఎస్టీ నిరుపేద మహిళలకు 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వడ్డీ లేని రుణాల ద్వారా రాష్ట్రంలో 226 యూనిట్లు లక్ష్యం కేటాయించగా, 234 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 11 యూనిట్లు లక్ష్యం కేటాయించగా, 13 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆటోకి, లబ్ధిదారులకు తప్పనిసరిగా బీమా చేయించాలన్నారు. నిర్ణీత వాయిదాలు వడ్డీ లేని అప్పు గ్రామ సంఘం ద్వారా తెరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ నరసింహారెడ్డి, యాంకర్ పర్సన్ మంజుల, ఏపిడీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

త్రిసాయుధ దళాల సేవలు ప్రశంసనీయం

త్రిసాయుధ దళాల సేవలు ప్రశంసనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో త్రిసాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని జాయింట్ కలెక్టర్‌కు స్టిక్కర్స్ అతికించడం జరగగా, హుండీలో తమ వంతు విరాళం ఇచ్చి కార్యాక్రమాన్ని జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రూ.11 వేలు విరాళం అందజేశారు. అనంతరం డాక్టర్ హిమబింధు రూ.5 వేలు, రఘునాథ్‌రెడ్డిలు రూ. 5 వేలు, దండు శ్రీనివాసులు రూ. 20 వేలను తమ వంతు విరాళంగా జెసికి అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ త్రిసాయుధ దళాల సేవలు కీలకమని, దేశ సేవలో వీర జవానుల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి జె.శ్రీనివాసులు, సైనిక్ బోర్డు మెంబర్స్ కె.బలరామ్ రావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు విశ్వేశ్వరరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జెసికి విరాళం అందజేస్తున్న టిడిపి నేత దండు శ్రీనివాసులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కళ్యాణదుర్గం : మామిడి సాగులో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని శాస్త్రవేత్త లక్ష్మిరెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్డీటీ రీజియన్ కార్యాలయంలో గురువారం మామిడి రైతులకు అవగాహన సదస్సు న్విహించారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలపై చర్చించి నివృత్తి చేశారు. సరైన సమయంలో నీటి వాడకం, తేనె, మంచు పురుగు, బాడిద తెగులు, చెదల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రఘునాథ్‌రెడ్డి, మండల ఉద్యాన అధికారి గౌసియా, ఎపి ఫుడ్ ప్రాసె సింగ్ సొసైటీ అధికారి మాధ్యూ, సెక్టార్ టీం లీడర్ రామకృష్ణ, ఎస్ఎంఎఫ్ నాగరూప, ఆర్డీటీ సిబ్బంది, మామిడి రైతులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై ఆర్‌డిఒకు టిడిపి ఫిర్యాదు

అనంతపురం కలెక్టరేట్ : వైసిపి నాయకులు టిడిపి మద్దతుదారుల ఓట్లు తొలగింపే లక్ష్యంగా ఫారం-7ను దుర్వినియోగం చేస్తున్నారని టిడిపి నేతలు ఆరోపించారు. ఈమేరకు గురువారం నగరంలో అనంతపురం ఆర్‌డిఒ గ్రంది వెంకటేష్‌ను 33వ డివిజన్ టిడిపి నాయకులు కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గోపాల్, సాకే జయప్ప, ధను, రామాంజనేయులు, గంగన్న మాట్లాడుతూ భారీ ఎత్తున ఓట్ల తొలగింపునకు వైసీపీ నాయకులు ఫారం-7 ద్వారా తెరలేపారని, 300 ఓట్ల తొలగింపు చేపట్టారని తెలిపారు. 30 సంవత్సరాల నుంచి నివాసముంటున్న వారిని కూడా తొలగించారని వివరించారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అమర్, తిమ్మరాజు, కళ్యాణ్, సాకే తేజ, రాము, రాజు, దేవరకొండ సోము, హరీష్, రాజశేఖర్, హన్ను తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలో గురువారం వినియోగదారుల చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వినియోగ దారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాచర్ల శ్రీనివాసులు వినియోగదారుల హక్కుల చట్టం-1986, 2019 చట్టంలో పొందుపరిచిన అంశాలను విద్యార్థులకు వివరించారు. వినియోగదారుల హక్కులు, చట్టం కల్పిస్తున్న రక్షణ గురించి తెలిపారు. ఆయా కార్యక్రమాలకు పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సోమ్లా నాయక్, బాలికల కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గౌరా సత్యనారాయణ, రాయదుర్గం వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి డి.అయూబ్‌ఖాన్, పౌర సరఫరాల విభాగం డిప్యూటీ తహశీల్దార్ సుదర్శనాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీక్షల్లో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలకు సంఘీభావం

గుంతకల్లు : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలకు గురువారం పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంఘీభావం తెలిపిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు దాసరి శ్రీనివాసులు, షబ్బీర్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు గోపీనాథ్, ఈశ్వరయ్య, గౌస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్, ఒపిడిఆర్ జిల్లా కమిటీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా గాంధీవిగ్రహం తొలగింపు

నార్పల : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం, శిలాఫలకాలను తాత్కాలికంగా తొలగించారు. విస్తరణ పనులను పూర్తయిన తర్వాత తిరిగి యథాస్థానంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచి మనీలా సుప్రియ, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జగనన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ మోహన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండల ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే వినతులు సమర్పించుకోవాలని కోరారు.

నేడు వ్యవసాయ సలహా మండలి సమావేశం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఆర్‌బికెలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, రైతులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

గంగాదేవి ఉత్సవమూర్తి ఊరేగింపు

పామిడి : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని బెస్త వీధిలో వెలిసిన గంగాదేవి ఆలయంలో స్వస్తి పుణ్యావచనం, గణపతి పూజ, కలశ స్థాపన, నవగ్రహ పూజలు చేశారు. అనంతరం గంగమ్మ దేవత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, మంగళ హారతి ఇచ్చారు. తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తిని జ్యోతులతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, కత్రిమల సర్పంచి చంద్రశేఖర్‌రెడ్డి, వంకరాజుకాలువ సర్పంచి నరసింహా, హనుమపల్లి సర్పంచి నారాయణస్వామి, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కెవిఎస్ పరీక్షల్లో ఆల్ ఇండియా 34వ ర్యాంకు

ఉరవకొండ : కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన పోటీ పరీక్షల్లో విడపనకల్లు మండలం హవలిగి గ్రామానికి చెందిన శర్మస్‌వలీ, ఫరీదా బేగం దంపతుల కుమార్తె సజియా సహనారా ఆల్ ఇండియా 34వ ర్యాంకు సాధించింది. సజియా 1 నుంచి 10వ తరగతి వరకూ రాయదుర్గంలో ఇంటర్, అనంతపురంలో డిగ్రీ విద్యనభ్యసించింది. సజియాకు చిన్నప్పటి నుంచి చదువుపై ప్రత్యేక శ్రద్ధ ఉన్నట్లు గమనించిన తల్లిదండ్రులతోపాటు బాబాయ్ గౌస్‌పీరా సహాయ, సహకారంతో కష్టపడి చదివి దేశవ్యాప్తంగా జరిగిన కేవీఎస్ ఉపాధ్యాయ పరీక్షల్లో దేశంలో 34వ ర్యాంకు, రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో జిల్లాలోని గుత్తి ఆర్‌ఎస్‌లో ఉన్న పీఎం కెవిఎస్ పాఠశాలలో ప్రైమరీ టీచర్‌గా ఉద్యోగం సాధించింది.

సజియా సహనారా

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాడిపత్రి రూరల్ : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎవి.రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సిఐ హమీద్‌ఖాన్‌పై విచారణ

అనంతపురం క్రైం : తాడిపత్రి పట్టణ సి.ఐ హమీద్‌ఖాన్‌పై విచారణకు ఆదేశించినట్లు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రిలో ఓ యువకుడిపై విద్యుత్ షాక్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అవుతున్న విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎస్పీ అదనపు ఎస్పీ, ట్రైనీ డీఎస్పీని ప్రత్యేక విచారణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. విచారణలో సి.ఐ హమీద్ ఖాన్ లోపం ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసు సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేద్దాం

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం సమిష్టిగా పని చేద్దామని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పోలీసు అధికారులు, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులతో వెల్ఫేర్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ముందుగా ప్రస్తుతం జిల్లాలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఆరోగ్యం, విద్య, విధులు, తదితర అంశాల పరంగా చేపట్టాల్సిన సంక్షేమ చర్యలను అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ఈసమావేశంలో ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ రమేష్‌నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులనాయుడు, రమణ, సరోజ, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, ఐటి కోర్ టీం మంజు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

కానిస్టేబుళ్ల కుటుంబాలకు చెక్కులు అందజేత

జిల్లాలో ఇటీవల మృతిచెందిన ఏఆర్ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల కుటుంబాలకు రూ.3 లక్షల విలువజేసే చెక్కులను ఎస్పీ అందజేశారు. ఏఆర్ ఎస్ఐ షంషేర్‌వలీ, సివిల్ కానిస్టేబుల్ ఉమేష్, ఏ.ఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదం, అనారోగ్య కారణాలతో వేర్వేరుగా మృతిచెందారు. ఆయా కుటుంబాలకు అడిషనల్ కార్పస్ ఫండ్ కింద చెరో రూ.లక్ష ప్రకారం రూ.3లక్షల విలువజేసే రెండు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో షంషేర్‌వలీ భార్య మస్తాన్ బీ, ఉమేష్ భార్య వనిత, కిరణ్‌కుమార్ భార్య అనిత, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఏఎస్ఐ కృతజ్ఞతలు

గుంతకల్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ గురకాల ప్రసాద్‌కు ఏఎస్ఐగా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పదోన్నతి కల్పించారు. అంతేగాకుండా కళ్యాణదుర్గం పట్టణ పోలీసుస్టేషన్‌కు పదోన్నతిపై బదిలీ చేశారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులనాయుడు, రమణతో కలిసి పదోన్నతి పొందిన ఏఎస్ఐ కృజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై గురువారం జిల్లావ్యాప్తంగా ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రైవింగ్ సమయంలో యూనిఫామ్ ధరించాలని, రికార్డుల కాపీలను వాహనాల్లోనే ఉంచుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసికెళ్లరాదని, డ్రైవర్ సీట్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మద్యం తాగి ఆటోలను నడుపరాదని, ఆటోలకు నెంబర్లను తప్పని సరిగా తీసుకోవాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

పెద్దపప్పూరు : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ శరత్‌చంద్ర సూచించారు. గురువారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేయడంతోపాటు వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ తాగి వాహనాతు నడపరాదన్నారు. అలాగే తాగి వాహనాలు నడిపినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే ఎక్కడపడితే వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకూడదన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వాహనదారులకు పోలీసుల అవగాహన

పెద్దపప్పూరులో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

ఆత్మకూరు : మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రోడ్డు నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఐ జనార్ధన్ డ్రంక్ అండ్ డ్రైవ్, అతి వేగం, అధిక బరువులతో వెళ్లడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా 108కు దారి ఇవ్వాలని కోరారు.

ముస్లిముల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో ముస్లిముల అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆల్ జామత్తుల్ ఇస్లామియా నూరు హుదా, దారుల్ ఉలూమ్ రజయే గౌసే ఆజం మదర్సాలకు తాగునీటి సమస్య పరిష్కరించినందుకు విశ్వేశ్వరరెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం అయ్యాక ముస్లిములకు అన్నివిధాలుగా అండగా ఉంటున్నారన్నారు. ఓట్ల కోసం ముస్లింలపై కపట ప్రేమ నటించే టిడిపిలా కాకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌అహమ్మద్, అనంతపురం మేయర్ వసీం సలీమ్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రిజ్వాన్, జిల్లా సెక్రటరీ ఖాజా, జిలాంంంంల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ,పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరం బాషా, కో అప్షన్ పామిడి సలీమ్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, సర్పంచి లలిత, ఎంపిపి నరసింహులు, జడ్పిటిసీ పార్వతమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, మాజీ ఎంపిపి చంద్రమ్మ, ఉరవకొండ ఖాజీలు అబ్దుల్ హై, పామిడి అజీమ్, వజ్రకరూరు ఖాజీ చాంద్‌బాషా, జెసిఎస్ కన్వీనర్ అసీఫ్, యువజన నాయకుడు వడ్ల సలీమ్, ఎంఎ జిలాన్, ఉస్మాన్, హొన్నూరుసాబ్, మాదర్సా ప్రతినిధులు మౌలానా, ఖాదర్, అబూ సాలెహ, బేల్దార్ జీలాన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం పెద్దలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, నాయకులు

తామర పురుగుతో మిరపకు నష్టం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన బ్యాడి రకం మిరప పంటలో అధికశాతం తామర పురుగు ఉండటంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఉద్యానశాఖ సహాయ జిల్లా సంచాలకులు నరసింహారావు సూచించారు. గురువారం మండలంలోని విరుపాపురం, మేడిమాకులపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో పర్యటించి మిరప పంటలను పరిశీలించారు. మిరపకు ఎక్కువగా తామర పురుగు చేరి పంటలో ఆకులను పీల్చి బొబ్బలు వచ్చేలా చేసి ముడుచుకునేలా చేస్తాయన్నారు. వీటి ఉధ్ధృ ఎక్కువగా ఉన్నప్పుడు లేత ఆకులు ఎదగక, చిన్నవిగా మారి మొక్కలు గిడసబారడం, పూతపిందె రాలడం, పిందె కాయలుగా మారకపోయే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణక సామూహికంంగా నీలి, పసుపు రంగు అట్టలను ఎకరాకు 25 నుంచి 30 వరకూ అమర్చి పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం తెల్లదోమ, ఆకుముడత వైరస్, తదితర తెగుళ్ల గురించి రైతులకు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారిణి మిత్రవింద మాధవి, మండల వ్యవసాయ సలహాదారుడు కృష్ణారెడ్డి, ఉద్యాన సహాయకులు జయలక్ష్మి, భాస్కర్, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

చేనేత కార్మికుడు ఆత్మహత్య

రామయ్య (పాతచిత్రం)

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని రామకోటి కాలనీకి చెందిన చేనేత కార్మికులు మంగలి రామయ్య (25) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రామయ్య గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడు. దీంతో తన మూడేళ్ల కొడుకుతో కలిసి భార్య సరస్వతిని పుటింటికి పంపాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన రామయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ శరత్‌చంద్ర సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుత్తిలో ఆరు దుకాణాల్లో చోరీ

మరో మూడు దుకాణాల్లో విఫలయత్నం

గుత్తి : పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో బుధవారం రాత్రి ఆరు దుకాణాల్లో చోరీ జరిగింది మరో మూడు దుకాణాల్లో దొంగలు చోరీకి యత్నించారు. దుకాణాలకు ఉన్న షట్టర్లను పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు లోనికి ప్రవేశించారు. నంద గోపాల్ కిరాణా దుకాణంలో రూ.8వేలు, మధుసూదన్ కిరాణా దుకాణంలో రూ.5వేలు, విష్ణువర్ధన్‌రెడ్డి, బ్రాహ్మిణీ డయగ్నాస్టిక్ సెంటర్, దాదు మందుల దుకాణం, బాషా కిరాణా దుకాణల్లో నగదుతో పాటు విలువైన వస్తువులను చోరీ చేసుకుని వెళ్లారు. ప్రకాష్ అంగడి, సర్వేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి ఫర్టిలైజర్ దుకాణాల్లో చోరీకి యత్నించారు. పట్టణంలో వరస చోరీలతో ప్రజల బెంబేలెత్తుతున్నారు. గుంతకల్లు రోడ్డులో గత నెలలో 8 దుకాణాల్లో చోరీ జరిగిన ఘటన మరవక ముందే దుండగులు మరోసారి చోరీలు చేయడం పట్ల దుకాణదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చోరీలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటన స్థలాన్ని సిఐ ఎం.వెంకటరామిరెడ్డి పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఐచర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గార్లదిన్నె : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం గుంతకల్లు నుంచి అనంతపురం వైపు వెళున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందర భాగం దెబ్బతిని ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్లదిన్నె మీదుగా వస్తున్న బస్సు హైవేపై ఎక్కేటప్పుడు క్రాస్‌లో ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఎదురుగా వేగంగా వస్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొందని తెలిపారు. అయితే ఐచర్ డ్రైవర్ అప్రమత్తతో బస్సులో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారన్నారు. గాయాలైన వారిని 108లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు ఢీకొన్న సమయంలో బస్సులో 63 మంది ప్రయాణికులు ఉన్నట్లు బస్సు డ్రైవర్ మహమ్మద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

కళ్యాణదుర్గం : పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 10 మందిని గురువారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం పట్టణ శివారులోని అక్కమ్మ దేవాలయం వద్ద మట్కా నిర్వాహకులు పట్టీలు రాస్తుండగా కొందరు గమనించారు. వారిని మట్కా నిర్వాహకులు బెదిరించి రూ. 3 వేలు దౌర్జన్యంగా లాక్కున్నారు. బాధితులు ఈ విషయాన్ని జిల్లా పోలీసు అధికారులకు తెలియజేయడంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్, డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాలతో రూరల్ సిఐ నాగరాజు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపం వద్ద కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన రవికుమార్, చాకలి ఓబులేసు, గాజుల మహేష్, మంజునాథ్‌రెడ్డి, రామాంజనేయులు, మురళీ, దాసరి నరసింహులు, బాపనపల్లి నరసింహులు, వడ్డే మహేష్, బోయ తిమ్మప్పలను అరెస్టు చేసి వారి నుంచి రూ. 48,230, 15 సెల్‌ఫోన్లు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ నాగరాజు, ఎస్ఐలు యువరాజు, సుధాకర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

యర్రగుంటపల్లిలో జెసి దివాకర్‌రెడ్డి పర్యటన

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని యర్రగుంటపల్లి గ్రామంలో మాజీ ఎంపీ జెసి దివాకర్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఇందులో భాగంగా టిడిపి కార్యకర్తల ఇళ్లకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెసి దివాకర్‌ని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

11న చలో విజయవాడ

పుట్లూరు : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి సామూహిక సెలవు కావాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో ఎండిఒ 1, 2కు ఆపరేటర్లు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ అశ్వర్థ, సిఆర్‌ఎంటిలు లాజరయ్య, జయచంద్ర, వీరయ్య, నారాయణస్వామి, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి సతీవియోగం

ఉమాదేవి

ఉరవకొండ : ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి సతీవియోగం కలిగింది. వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవి గురువారం మృతిచెందారు. ఈమె అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈనేపథ్యంలో గురువారం ఆరోగ్యం విషమించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

భూసార పరీక్షల ఫలితాలపై శిక్షణ

పుట్లూరు : భూసార పరీక్ష ఫలితాలపై మండల కేంద్రంలోని ఆర్‌బికెలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం డిడిఎ ఎంసీ మద్దిలేటి, ఎడిఎ శైలజాకుమారి రైతులకు భూసార పరీక్షలపై వివరించారు. ఇందులో భాగంగా మట్టి నమూనా సేకరణ విధానం, వాటి ఫలితాల ఆధారంగా పంటల వారీగా ఎరువుల వాడకం, నానో యూరియా గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం పలువురు రైతులకు భూసార పరీక్ష పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో కాత్యాయని, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మలదిన్నెలో మహాసభల కరపత్రాలు విడుదల

అనంతపురం : మాదిగ హక్కుల పోరాట సమితి (ఎంహెచ్ పిఎస్) రాయలసీమ స్థాయి మహాసభలు జయప్రదం చేయాలని సంస్థ సాంస్కృతిక రంగ రాయలసీమ ఇన్‌ఛార్జి అమ్మలదిన్నె కుళ్లాయప్ప కోరారు. ఈమేరకు గురువారం మండల పరిధిలోని అమ్మలదిన్నెలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ పిఎస్ నాయకులు బి.శివరంగయ్య, చక్రప్ప, చిన్న చెన్నయ్య, విజయప్రతాప్, ఈశ్వరయ్య, తిరుమలేసు, ఓబిలేసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రదీప్‌రాజుకు జెఎన్‌టియు డాక్టరేట్



అనంతపురం : పరిశోధన విద్యార్థి బడబాగ్ని ప్రదీప్ రాజుకు జెఎన్‌టియు గురువారం పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసింది. ఈయన అనంతపురంలోని రసాయన శాస్త్రం విభాగం ప్రొఫెసర్ ఎన్.దేవన్న పర్యవేక్షణలో 'సింథసిస్, క్యారెక్టరైజేషన్ అండ్ అంటిమైక్రోబియల్ స్టడీస్ ఆన్ నికెల్, కాపర్ అండ్ మెగ్నిషయం సబ్స్టిట్యూటెడ్ జింక్ ఫెర్రిట్ నానోపార్టికల్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సహ అధ్యాపకులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

వర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరింటెండెంట్‌గా జనార్ధన్‌రెడ్డి

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా జి.జనార్ధన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు వర్సిటీ ఉపకులపతి రంగజనార్ధన, రిజిస్ట్రార్ సి.శశిధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్మొ చేయకుండా వర్సిటీ అభివృద్ధిలో తనవంతు బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

శింగనమల : విద్యార్థినుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రైతులు సాగులో సమయాన్ని, అనవసర ఖర్చులు తగ్గించుకునేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంఇఒ-2 శివప్రసాద్, కెనరా బ్యాంకు మేనేజర్ రమేష్ శంకర్‌నాయక్, ఎఒ అన్వేష్‌కుమార్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, సర్పంచి నాగ మునెమ్మ, సూపర్‌వైజర్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, ఓబిరెడ్డి, రామాంజులు, మహిళా పోలీస్ హరిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయశ్రీ, సోషల్ వెల్ఫేర్ అధికారి నాగేంద్ర, సచివాలయ ఏఎన్ఎం శైలజ ఎంపిఇఒ ఉమా, డిజిటల్ అసిస్టెంట్ నాయక్, ఫిషరీస్ విభాగం సుధాకర్, కెజిబివి సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో పాల్గొనండి

రాయదుర్గం : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ నెల 13వ తేదీలోగా సచివాలయాలు, వాలంటీర్ల వద్ద పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆటల పోటీలను ఈ నెల 15వ తేదీ నిర్వహిస్తారన్నారు.

ప్రజల్లో మార్పు రావాలి

'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ'లో నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

'ఒక్కచాన్స్' అంటూ మనల్ని ముంచిన వైసిపి సర్కారుకు బుద్ధి చెప్పేందుకు మీ నుంచే మార్పు రావాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. 'బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీఖానా ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనతో రైతులు విసిగిపోయారన్నారు. కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసినా ఎవరూ భయపడవద్దని, మీవెనుక మేమున్నాం అంటూ భరోసా ఇచ్చారు. 30ఏళ్ల కాలంలో జెసి సోదరులు ఏం చేశారో చెప్పాలని అంటున్న ఎమ్మెల్యే ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్దవడుగూరు పరిసర ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించి నీటి నిల్వలు, భూగర్భజలాలను పెంచింది టిడిపి కాదా.. అలాగే గుత్తిరోడ్డు, శివాలయం రోడ్డు వెడెల్పు చేసి ప్రజల ఆస్తులను పెంచేలా చేసిన ఘనత టిడిపి కాదా.. అని నిలదీశారు. తాడిపత్రిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి నాయకులు తమను నామినేషన్ వేయనీయకుండా అడ్డుకునేందుకు అడ్డుకున్నప్పటికీ ఎవరికీ భయపడకుండా నామినేషన్ వేసి గెలిచి సత్తా చాటామని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ అబ్దుల్ రహీం, కౌన్సిలర్లు పర్వీన్, కమలమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఆవులాంపల్లి కేశవరెడ్డి, మండల కన్వీనర్ కేశవరెడ్డి, సీనియర్ నాయకులు బాలిరెడ్డి, నారాయణస్వామి, యువజన విభాగం నాయకుడు దివాకరరెడ్డి, గంగరాజు, హరినాథ్‌రెడ్డి, దిమ్మగుడి రాజారెడ్డి, చిరంజీవులు, ప్రసాద్‌యాదవ్, హరినాథరెడ్డి, పట్టణాధ్యక్షుడు రవిశేఖరరెడ్డి, నాగన్న, రమేష్‌యాదవ్, నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

పామిడి : పట్టణంలోని 20వ వార్డులో 'బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జితేంద్రగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దుర్మార్గ పాలన సాగిస్తోందన్నారు. సామాన్యుడు జీవించలేని విధంగా ధరలు పెంచేసి దోచుకుంటున్నారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రంగస్వామి, గౌస్, వడ్డే శివకుమార్, బొమ్మ మోహన్‌కృష్ణ, కుమార్, వెంకటరమణ, సూరి, మాలిక్ బాషా, బోయ శివ, రాజేంద్ర, చీమల రాము, మస్తాన్, దాదా, వెల్డింగ్ బాబా, దూదు, రామాంజనేయులు, శ్రీనివాసులు, హనుమంతు, ఫజులు, రాయల్ వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులు గురువారం పట్టణంలోని పలువీధుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వార్డులోని పలు వీధుల్లో ఉన్న విద్యుత్ ఇనుప స్తంభాల స్థానంలో సిమెంటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ నదీముల్లా ఫారుఖ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెలఏయ చొరవతో ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకుమార్, లైన్ ఇన్స్‌పెక్టర్ నాగేంద్రప్రసాద్‌లో పర్యవేక్షణలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. స్తంభాలు ఏర్పాటుతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ లైన్లను మారుస్తున్న అధికారులు

వికలాంగుల హక్కులను కాపాడాలి

గార్లదిన్నె : వికలాంగుల హక్కులను కాపాడాలని ఆర్డీటీ ఎస్‌టిఎల్ ఇంద్రప్రసన్న కోరారు. గురువారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌టిఎల్ మాట్లాడుతూ వికలాంగుల హక్కులను కాపాడి సమాజంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ రామాంజనేయులు, అరుణోదయ మండల సమాఖ్య ప్రెసిడెంట్ యల్లమ్మ, సెక్రటరీ నారాయణ జాయింట్ సెక్రటరీ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ బుకింగ్ చేసుకోండి : ఎఒ

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఎఒ సాయికుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ఎఒ విలేకరులతో మాట్లాడుతూ రబీలో పంట సాగు చేసిన రైతులు వారి పరిధిలోని ఆర్‌బికెలో తప్పనిసరి నమోదు చేసుకుని క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి గోపాల్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.